సాక్షి
చిత్తూరు
సోమవారం । 15 । సెప్టెంబర్ । 2025



**హత్యా..ఆత్మహత్యా**
పాకాల మండల శివారు బయటపడిన జాతీయ రహదారికి 3కి.మీ దూరంలో మృతదేహాలు కలకలం రేపాయి. - 8లో



**కుంకీలతో పనికానట్టేనా?**
మదపు టేనుగుల కట్టడి కోసమే తీసుకొచ్చిన కుంకీలతో పని అయ్యేటట్లు కనిపించడం లేదు. - 8లో



**గజరాజుల బీభత్సం**
పాతపేట, చల్లావారిపల్లెలో ఏనుగులు పంట పొలాలపై పడి బీభత్సం సృష్టించాయి. - 8లో

## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

**చిత్తూరు కలెక్టరేట్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

### నేడు పోలీసు గ్రీవెన్స్

**చిత్తూరు అర్బన్ :** చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

### ఉపాధ్యాయులకు శిక్షణ

**చిత్తూరు కలెక్టరేట్ :** మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఇండెక్షన్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు డీఈవో కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. రీసోర్స్ పర్సన్‌లుగా జిల్లాలో ఎంపిక చేసిన సబ్జెక్ట్ నిపుణులను డిప్యుటేషన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు ఎస్ఆర్‌పీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆ తర్వాత జిల్లాలో ఎంపికైన డీఎస్సీ ఉపాధ్యాయులకు దసరా సెలవుల్లో శిక్షణ ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు.

### 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి

**చిత్తూరు కలెక్టరేట్ :** 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యారంగ సమస్యలు, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బైక్ జాతా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రణభేరి బైక్ జాతాలో ఈనెల 15వ తేదీన చిత్తూరు నగరంలోని దర్గా సర్కిల్ వద్ద డా.బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి గాంధీ విగ్రహం వద్దకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద సభను నిర్వహించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు.

### అక్టోబర్ 2 నుంచి ఇంటికే కులధ్రువీకరణ పత్రం

**చిత్తూరు కలెక్టరేట్ :** కుల ధ్రువీకరణ పత్రాలు అక్టోబర్ 2 నుంచి ఇంటికే పంపించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో అందిన దరఖాస్తులను వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. అర్హులైతే వీఆర్‌వో లాగిన్‌లో పేర్లు నమోదు చేసి ఆర్‌ఐలకు పంపుతున్నారు. అక్కడి నుంచి తహసీల్దార్, ఆర్‌డీవో, జాయింట్ కలెక్టర్ లాగిన్‌లకు పరిశీలనకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఆమోదం పొందిన పేర్లను రెవెన్యూ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ చేపడుతున్నారు.

## అక్షరమే ఆయుధం



### పాత్రికేయులను భయపెడుతున్నారు



ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను పత్రికల్లో రాసినందుకే విలేకరులపై ప్రతాపం చూపుతున్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలు కీలకంగా పనిచేస్తాయి. ప్రజాపక్షాన నిలబడే పత్రికలపై జులుం ప్రదర్శిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారు. పాత్రికేయులను భయపెడుతున్నారు. అడ్డగోలుగా కేసులు పెడుతున్నారు. నిజాలను వెలుగులోకి తీసుకురావడం ప్రతికల హక్కు. ఆ హక్కును హరించడం దారుణం. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. పత్రికలపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలి. రాష్ట్రంలో విషసంస్కృతిని తీసుకువస్తున్నారు. విలేకరులకు స్వేచ్ఛ ఇవ్వాలి. లేకుంటే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– లలితా థామస్, మాజీ ఎమ్మెల్యే, పలమనేరు

### ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రజలకు వాస్తవాలను తెలిపే పత్రికలపై కూటమి ప్రభుత్వం కేసులు పెట్టడం, దాడులు చేయడం, వేధించడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలపై రాజకీయ నాయకులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, ప్రసంగాలను సాక్షి దిన పత్రికలో ప్రచురించారనే ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉంది. పత్రిక, ఎడిటర్, సిబ్బందిని నిందితులుగా చేర్చడం కూటమి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి లోపాలను ఎత్తిచూపే పత్రికలపై కేసులు పెట్టి, వేధించడం దారుణం. ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికలు నిర్వీర్యమైపోతాయి. అధికారబలం ఉన్నవాడికే జీవించే హక్కు లభిస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా ఈ విషయంలో పునరాలోచించాలి. ప్రజాస్వామ్యబద్ధంగా పాలించాలి.

– బియ్యపు మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ,శ్రీకాళహస్తి

# ‘స్మార్ట్’ బాదుడు !

**స్మార్ట్ మీటర్లు అంటూ ఎవరైనా వస్తే వాటిని పగులగొట్టండి.. మీకు అండగా ఉంటానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ నేడు అధికారంలోకి రాగానే అదే స్మార్ట్ మీటర్లను పెట్టడంపై ప్రజల్లో విస్మయం వ్యక్తం అవుతోంది. ముందుగా కమర్షియల్ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు బిగించడంతో రూ.2 వేలు నుంచి 4 వేలు వస్తున్న కరెంట్ బిల్లు నేడు ఏకంగా రూ.25 వేలు నుంచి రూ.70 వేలు వరకు వస్తుండడంతో చిరు వ్యాపారులు వణకిపోతున్నారు. వ్యాపారాలను మూసివేయడం తప్ప తమకు మరోదారి లేదంటూ విలపిస్తున్నారు.**



పరిశ్రమ మూతపడితే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్న కూలీలు (ఇన్ సెట్లో) ప్రజల సొమ్మును లాగేస్తున్న స్మార్ట్ మీటర్

- జిల్లులు చెల్లించలేమంటూ చిరువ్యాపారులు గగ్గోలు
- మూతకు సిద్ధమవుతున్న చిన్నపాటి పరిశ్రమలు
- సంపద సృష్టి అంటే ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్న జనం
- అధిక బిల్లులతో ఆందోళనలో వ్యాపారులు

**పుత్తూరు :** కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్మార్ట్ మీటర్ల విధానంపై రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగులగొట్టండి అంటూ బహిరంగ వేదికలపై ప్రకటనలు చేశారు. అధికారంలోకి రాగానే అదే విధానాన్ని చంద్రబాబు అమలు చేయడంపై వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వమే ఇలా బిల్లుల పేరిట దోపిడీకి దిగితే తాము ఎవరితో మొరపెట్టుకోవాలంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో వ్యాపారాలే నమ్ముకొని జీవనం సాగిస్తున్న కుటుంబాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.

**మూతపడనున్న చిన్న పరిశ్రమలు**

చిన్నపాటి యంత్రాల ఆధారంగా, కొంత మంది కూలీలకు ఉపాధి కల్పిస్తూ నడిచే చిన్నపాటి పరిశ్రమలు కూటమి బాదుడుకు మూతకు సిద్ధమవుతున్నాయి. ఈ తరహా పరిశ్రమలు పట్టణాలు, పల్లెల్లోనూ మనకు కనిపిస్తుంటాయి. ఇందులో కొయ్య తోపుడు యంత్రాలు, సిమెంట్ రాయి తయారీ, పిండి మిల్లులు, వెల్డింగ్ వర్క్ షాపులు, పవర్‌లూమ్స్, రెడీ మేడ్ డ్రస్సులు, ఫర్నీచర్ తయారీ వంటివి మనకు నిత్యం కనిపించేవి. కూటమి ప్రభుత్వం బిగించిన స్మార్ట్ మీటర్లతో వస్తున్న అధిక బిల్లులతో పరిశ్రమల నిర్వాహకులు దిక్కుతోచని పరిస్థితిలోకి నెట్టేశారు. సరసమైన ధరలతో నిరంతర విద్యుత్ సరఫరా అయితే స్మార్ట్ మీటర్ల పేరిట రోడ్డున పడేస్తే ఎలా అంటూ వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. నాడు మీటర్లు పగులగొట్టమన్నారు, ఈ రోజు అదే మీటర్ల కత్తిపైన కూర్చోబెట్టారు. ఇది ఎంత వరకు సమంజసమంటున్నారు. ఈ బిల్లుల బాధను తాము తట్టుకొని నిలబడలేమని, మూసివేయడమే తప్ప తమకు మరో మార్గం కనిపించడం లేదంటూ పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### హడలిపోతున్న గృహ వినియోగదారులు

ప్రస్తుత కాల పరిస్థితుల్లో టీవీ, కూలర్, ఏసీ, ఫ్రిడ్జ్, మిక్సీ, వాషింగ్ మిషన్, హీటర్ వంటివి సర్వ సాధారణంగా ప్రజలు వినియోగిస్తున్న ఎలక్ట్రికల్ వస్తువులు. వీటన్నింటిని వినియోగిస్తే ప్రస్తుతం నెలవారి బిల్లు మహా అంటే రూ.2 నుంచి 3 వేలు ఉంటోంది. ప్రస్తుత స్మార్ట్ మీటర్ల ఏర్పాటును పరిశీలిస్తే నెలకు రూ.10 వేల నుంచి 20 వేల బిల్లులు వస్తాయోమనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### జిల్లా సమాచారం

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యుత్ సర్వీసుల వివరాలు

| | |
|---|---|
| గృహ వినియోగదారులు | 13,03,270 |
| వాణిజ్య వినియోగదారులు | 1,61,215 |
| పరిశ్రమలు | 21,175 |
| ప్రభుత్వ కార్యాలయాలు | 45,405 |
| వ్యవసాయ వినియోగదారులు | 3,32,264 |

- ప్రభుత్వ కార్యాలయాలకు 90 శాతం వరకు స్మార్ట్ మీటర్ల బిగించేశారు.
- వాణిజ్య వినియోగదారుల కనెక్షన్లకు ఇప్పటి వరకు 10 శాతం బిగించారు.

### 559 యూనిట్లకు రూ.45,720 బిల్లు



నేను పుత్తూరు బైపాస్ రోడ్డులో ఓంశక్తి సిమెంట్ బ్రిక్స్ పేరిట సిమెంట్ రాళ్ల తయారీ కేంద్రాన్ని నడుపుతున్నా. గతంలో నెలకు రూ.4 వేలు నుంచి 5 వేలు మించి కరెంట్ బిల్లు వచ్చేది కాదు. గత ఏప్రిల్ మాసంలో స్మార్ట్ మీటర్ బిగించారు. అంతే మే నెలలో రూ. 16 వేలు, జూన్‌లో రూ.20 వేలు, జూలైలో 13 వేలు, ఆగస్టులో రూ.45,720 బిల్లు వచ్చింది. ఇలా వేలకు వేలు బిల్లులు వస్తే మేము ఎలా బతకాలో అర్థం కావడం లేదు. నా వద్ద పనిచేస్తున్న 15 మంది కూలీలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది.

– ఎస్.శివకుమార్, ఓంశక్తి సిమెంట్ బ్రిక్స్, పుత్తూరు.

### పగులగొట్టమన్నారు..మళ్లీ బిగించారు..



గతంలో మీరే స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులగొట్టండి అన్నారు. నేడు మీరే బిగించి వేలకు వేలకు బాదుతున్నారు. దీనిని ఏమని ప్రశ్నించాలి? నేను 30 ఏళ్లుగా పుత్తూరులో వెల్డింగ్ వర్క్ షాపు నడుపుతున్నా. నెలకు రూ.70 నుంచి రూ.2 వేలకు మించి కరెంట్ బిల్లు కట్టింది లేదు. అలాంటిది ప్రస్తుతం రూ.25 వేలు కరెంట్ బిల్లు చూసి ఆశ్చర్యపోయాను. ఇప్పటికే ఇద్దరు కూలీలను పనిలో నుంచి తీసేశాను. ఈ కరెంటు బిల్లులు చెల్లించే పరిస్థితి లేక షాపును మూసివేయడం తప్ప మరోమార్గం కనిపించడం లేదు.

– వెంకటస్వామి, వెల్డింగ్ వర్క్‌షాపు, పుత్తూరు

### ఫిర్యాదులు వచ్చాయి



స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేసిన వారి వద్ద నుంచి కొన్ని ఫిర్యాదులు అందాయి. స్మార్ట్ మీటర్లలోని టెక్నికల్ డేటా గురించి ఏర్పాటు చేసేవారికి గానీ, మాకు గానీ సమాచారం ఇవ్వలేదు. అందువల్ల కొంత తేడా వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. కేటగిరి–2 లోనూ ఎక్కువ కంజెంక్షన్ వచ్చే సర్వీసులకు మాత్రం మీటర్లను ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటి వరకు 300 వరకు బిగించాం. ఆటో కెపాసిటర్స్ ఏర్పాటు చేసుకోవడంతో మీటర్ రీడింగ్ సక్రమంగా ఉంటుంది.

– ఎస్.ఆశీర్వాదం, విద్యుత్ ఈఈ, పుత్తూరు డివిజన్

# కామధేనువుపై లంబోధరుడు!



**కామధేనువుపై స్వామి దర్శనం**

**కాణిపాకం:** ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆదివారం రాత్రి కామధేనువుపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భారీగా తరలివచ్చిన భక్తజనం స్వామిని తిలకించి పరవశించారు. సాయంత్రం తొలుత అలంకార మండపంలో శ్రీసిద్ధి బుద్ధి సమేత వినాయస్వామి ఉత్సమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి కామధేను వాహనంలో అధిష్టింపజేశారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, కోలాటాలు, భజన బృందాల ప్రదర్శనల నడుమ ఊరేగింపు అంగరంగ వైభవంగా చేపట్టారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు.



**నేడు పూలంగిసేవ...**

ప్రత్యేక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సోమవారం పూలంగిసేవను నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం అభిషేకం, రాత్రి పూలంగిసేవ ఉంటుందన్నారు.

# ఆపేది ఎవడ్రా?

- జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా అసాంఘిక కార్యకలాపాలు
- పోలీసులకు చెప్పలేక.. నేరుగా కలెక్టర్, ఎస్పీలకే ఫిర్యాదులు
- నేతల అభయహస్తం..? ఖాకీల ఉదాసీనతే నిందితుల ధైర్యం!
- కొత్త ఎస్పీ అయినా దృష్టి సారించేనా?



**చిత్తూరు అర్బన్:** చిత్తూరులో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అసాంఘిక కార్యకలాపాలను విచ్చలవిడిగా సాగిస్తున్నారు. వీరి ఆటకట్టించేందుకు ఎందుకో ప్రజాహితమైన ఫిర్యాదులు పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లడం లేదు. నేరుగా కలెక్టర్, ఆపై ఎస్పీకే ఇక్కడి అన్యాయాలను చెప్పేస్తున్నారు. వాళ్లు రంగంలోకి దిగితేతప్ప.. న్యాయం జరగదనే భావన బలంగా పాతుకుపోయింది.

**అధికారమే అండగా!**

అర్ధగంట జీపు తీసుకుంటే చిత్తూరు నగరం మొత్తాన్ని ఓసారి చుట్టి రావొచ్చు. మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ శాంతి భద్రతలకు పెద్దగా విఘాతాలు కల్పించడం, ఫ్యాక్షన్ గొడవల్లాంటివి లేవనే చెప్పాలి. ఇదే సమయంలో గత కొంతకాలంగా చిత్తూరును అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చేస్తున్నారు. నగరంలో విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు నిర్వహించడం, నిషేధిత లాటరీ టికెట్ల విక్రయాలు, ప్రభుత్వ భూములను కబ్జా చేయడం, ప్రైవేటు సెటిల్‌మెంట్లు, అర్ధరాత్రి గ్రానైట్ స్మగ్లింగ్, ఫేక్ కంపెనీ సిగరెట్ల విక్రయాలు, వీధి వీధిలో జరుగుతున్న గంజాయి విక్రయాలు కలవర పెడుతున్నాయి. తప్పు చేస్తున్న వారిలో ఎక్కువమంది అధికార పార్టీకి దగ్గరగా ఉన్నారనే విమర్శలున్నాయి. ఇలాంటి విషయాలు నాయకులకు తెలియడం లేదా..? అన్నీ వాళ్ల కనుసన్నల్లో జరుగుతున్నా మౌనంగా ఉంటున్నారా..? ఒకవేళ వాళ్లకు సంబంధం లేకుంటే సరిదిద్దే ప్రయత్నం ఎందుకు చేయడం లేదు..? అనే ప్రశ్నలు సామాన్యులను తొలిచేస్తున్నాయి.

**ఖాకీలు గట్టిగా ఉండడంలేదా..?**

చట్టాన్ని ఎవ్వరూ చేతుల్లోకి తీసుకోకూడదు. కానీ ఇదే సమయంలో తప్పు చేసిన వ్యక్తి ఖాకీలను చూస్తే మాత్రం భయపడి తీరాల్సిందే. చిత్తూరులో వన్‌టౌన్, టూటౌన్, తాలూక లాంటి ప్రధాన మూడు స్టేషన్లతో పాటు వీటిని పర్యవేక్షించడానికి డీఎస్పీ స్థాయి అధికారి కూడా ఉన్నారు. కానీ రహస్యమైన సమాచారం, అసాంఘిక కార్యకలాపాల వివరాలు మాత్రం స్టేషన్లకు వెళ్లడం లేదు. ఇక్కడ పనిచేసే అధికారులపై నమ్మకం లేదా..? అంటే లేకపోవడం వల్లేకదా కీలక ఫిర్యాదులు కలెక్టర్, ఎస్పీ వరకు వెళుతున్నాయనే సమాధానం వినిపిస్తోంది. తప్పుచేసిన వాళ్లు తనవాళ్లైనా వదలొద్దని ప్రజాప్రతినిధులు బహిరంగంగా చెబుతున్నా.. ఖాకీలు చర్యలకు ఉపక్రమించకపోవడం అవి వట్టి మాటలేననే సందేహం కలుగుతోంది. నేడు బాధ్యతలు చేపడుతున్న నూతన ఎస్పీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### వీటిని కాదంటారా?

- చిత్తూరు నగర నడిబొడ్డున ఉన్న భరత్ నగర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆడబిడ్డను చిదిమేసే ఈ పరీక్షలకు రూ.వేలల్లో వసూలు చేస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. కలెక్టర్‌కు ఫిర్యాదు వెళ్లడంతో స్వయానా ఆయనే రంగంలోకి దిగారు. పోలీసులతో కలిసి ఆపరేషన్ నిర్వహించి నిందితులపై చట్టపరంగా ముందుకు వెళ్లారు.
- రూ.కోట్లు విలువ చేసే మునిసిపల్ స్థలాన్ని ఆక్రమించి, ప్లాట్లు వేసి విక్రయానికి పెడితే కార్పొరేషన్ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. లెనిన్ నగర్‌లో జరిగిన ఈ దందాను అజ్ఞాత వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే.. అధికారులకు ఛీవాట్లు పెట్టి అన్యాక్రాంతమైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఆపై భూమిని ఆధీనంలోకి తెచ్చుకున్న అధికారులు కేసు పెట్టకుండా మమ అనిపించారు.
- చిత్తూరులోని గంగనపల్లెలో పేకాట క్లబ్బు నిర్వహిస్తున్నారని స్థానికంగా ఉన్న మహిళలు నేరుగా ఎస్పీ వాట్సాప్‌కు మెసేజ్ చేశారు. ఆ పరిధిలోకి వచ్చే పోలీసులకు ఏమాత్రం అనుమానం రాకుండా.. స్పెషల్ బ్రాంచ్ విభాగంతో దాడులు చేయించి 24 మందిపై ఎస్పీ కేసు నమోదు చేయించి, క్లబ్ మూయించారు. నిందితుల్లో అత్యధికులు.. ఫిర్యాదు చేసినవాళ్లు అధికారపార్టీ వాళ్లేనని సమాచారం.
- పలమనేరు, పుంగనూరు, మదనపల్లె, తిరుపతి లాంటి ప్రాంతాలకు నిషేధిత లాటరీ టికెట్లు చిత్తూరు నుంచి ఎగుమతి చేస్తూ.. రోజుకు రూ.లక్షలు కొల్లగొడుతున్నారు. చిత్తూరు నగరంలో పాత బస్టాండు, సుందరయ్యవీధి, గిరింపేట, చర్చివీధి, బజారువీధి, ఓటీకే రోడ్డు ప్రాంతాల్లో బహిరంగంగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్నా నామమాత్రపు కేసులు తప్ప.. అధికారపార్టీ ముసుగులో ఉన్న కింగ్‌పిన్‌ను ఏమీ చేయలేకున్నారు.

# సమానత్వం దిశగా అడుగులు

- తిరుపతిలో తొలి మహిళా సాధికారత సదస్సు శుభసూచికం
- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా




సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తదితరులు



వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన సభ్యులు

**తిరుపతి అర్బన్ :** తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సును తిరుపతిలో నిర్వహించడం శుభసూచికమని, ఇదే స్ఫూర్తితో ఎలాంటి వివక్ష లేకుండా సమానత్వం దిశగా అడుగులు వేద్దామని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పిలుపునిచ్చారు. ఆదివారం తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. మూడురోజులపాటు నిర్వహించనున్న సదస్సులో ముందుగా జాతీయ, రాష్ట్ర గీతం ఆలపించి ప్రారంభించారు. పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షులు పురందేశ్వరి, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎంపీ మద్దిల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకసభ స్పీకర్ మాట్లాడుతూ భక్తి, త్యాగం, మహిళా కృషికి తిరుపతి ప్రతీకని తెలిపారు. అందుకే తొలి సమావేశానికి తిరునగరాన్ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వికసిత్ భారత్–2047కి స్వాతంత్రం వచ్చి వందేళ్ల గడుస్తోందన్నారు. భారత్ అభివృద్ధిలో మహిళాశక్తి ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రాజసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ తిరుపతి వేదికగా మహిళా సదస్సును నిర్వహించడం విజయానికి నాందిగా భావిస్తున్నామన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూతిరుపతిలో మహిళా సాధికారత తొలి సదస్సును జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సదస్సులో తీసుకోనున్న తీర్మానాల అమలుకు దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరారు. పురంధేశ్వరి మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ముందడుగు పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ మహిళలకు సురక్షితత, విద్య, నైపుణ్యాలు, అభివృద్ధిలో సమాన భాగస్వామ్యాన్ని కల్పించే దిశగా చట్టసభ్యులందరినీ ఈ సదస్సు ఏకం చేస్తుందని తెలిపారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సమాన అవకాశాలు, సురక్షిత సమాజం, గౌరవమైన జీవితం కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. సాధికారత కమిటీ చైర్‌పర్సన్ గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు దేశవ్యాప్తంగా మహిళా సాధికారత విధానాలు తెలుసుకోవడానికి, అనుభవాలు పంచుకోవడానికి, సవాళ్లపై చర్చించడానికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని వెల్లడించారు. డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు మాట్లాడుతూ. తిరుపతిలో ఈ సమావేశం నిర్వహించడం చారిత్రాత్మకమైన ఘట్టమని తెలిపారు.

### చంద్రగిరి కోటలో..



కోట వద్ద ఆదివారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ సోమవారం సదస్సుకు హాజరుకానున్నారు. రెండవ రోజు రాహుల్ కన్వెన్షన్‌లోనే ముగింపు సభ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రేపటి నుంచి పాఠశాలల్లో 'స్వచ్ఛతా పక్వాడా'

**చిత్తూరు కలెక్టరేట్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 16వ తేదీ నుంచి ఈనెల 30 వరకు స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆ కార్యక్రమం షెడ్యూల్, విధి విధానాలకు డీఈవో కార్యాలయానికి పంపారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలో పకడ్బందీగా స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. కార్యక్రమంలో నిర్వహించే ఫొటోలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

**షెడ్యూల్ ఇలా......**

ఈనెల 16న స్వచ్ఛత ప్రతిజ్ఞ , 17న నీటి పారిశుధ్య సదుపాయాల తనిఖీ, మరమ్మతులకు ప్రణాళికలు, 18న పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ సమావేశాలు, 19న పాఠశాల పరిసరాల శుభ్రతపై దృష్టి, 20న వ్యాసరచన పోటీలు (స్వచ్ఛత అంశంపై), 21న పెయింటింగ్, మోడల్ మేకింగ్ పోటీలు , 22న క్విజ్ పోటీలు, 23న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ దినం, 24న పాడైన వస్తువులు, పాత ఫర్నిచర్ మొదలైన చెత్తను తొలగించడం, 25న పాఠశాలల్లో మొక్కలు నాటడం, 26న చేతులు శుభ్రం చేసుకునే విధానంపై అవగాహన, 27న విద్యార్థులు, టీచర్లు స్థానిక ప్రజలకు స్వచ్ఛత అవగాహన కార్యక్రమం, 28న శుభ్రపరిచే ప్రత్యేక డ్రైవ్, 29న స్వచ్ఛత అవగాహన ర్యాలీలు, 30న స్వచ్ఛత ప్రదర్శన, ఉత్తమ పాఠశాలలకు బహుమతులు మొత్తం కార్యక్రమాల సమీక్ష, నివేదిక అంద జేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### నేడు ఎస్పీ తుషార్ డూడి బాధ్యతల స్వీకరణ



**చిత్తూరు అర్బన్ :** చిత్తూరు నూతన ఎస్పీగా నియమితులైన తుషార్ డూడి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. బాపట్ల ఎస్పీగా పనిచేస్తున్న ఆయన చిత్తూరుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు. ఇందుకోసం జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది.

### డీసీసీబీలో అడ్డగోలుగా విచారణ !

**చిత్తూరు రూరల్ (కాణిపాకం) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొందరు నేతలు డీసీసీబీపై కన్ను పెట్టారు. కక్ష పూరితంగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉన్న పాలకవర్గంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. కోట్లల్లో అవినీతి, అక్రమాలంటూ కట్టుకథలు అల్లుతున్నారు. ప్రజలను, డీసీసీబీ రుణదారులను ఉసిగొల్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే విచారణ పేరుతో రుణాల మంజూరులో భారీగా బోగస్ జరిగిందని తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారు. ప్రస్తుతం సెక్షన్ 51 కింద విచారణ జరుగుతోంది. ఇంతలోనే అధికారులు సస్పెండ్ అంటూ కొందరు అధికారులు, సిబ్బంది పేర్లను తెరపైకి తీసుకొస్తున్నారు. శాఖలో 11 మంది ఉద్యోగుల సస్పెన్షన్ 30 మందిపై చర్యలు తీసుకోవాలని నోటీసులు జారీ చేసినట్లు చెబుతున్నారు. దీనిపై పెద్ద కుట్రే దాగుందని డీసీసీబీ రుణదారులు మండిపడుతున్నారు. ఇదంతా కక్ష పూరితమేనని వారు వాదిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన లోటును భర్తీ చేసి... గత ఐదేళ్లల్లో డీసీసీబీ లాభాల్లో పయనించేలా చేశారని రుణదారులు గుర్తు చేస్తున్నారు. చిన్న తప్పిదాలను బూతద్దంలో చూపించాలనే ప్రయత్నంలో ఉన్నారని, అలాగే గత పాలకవర్గానికి కొందరు అధికారులు, సిబ్బంది అంటకాగారని..టార్గెట్ చేసి ఈ కుట్రకు పాల్పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

# కుంకీలతో పనికానట్టేనా?

- కౌండిన్యలో హడలు పుట్టిస్తున్న మదపుటేనుగులు
- ఎలిఫెంట్ క్యాంపు వద్దకే వస్తున్న గజరాజులు
- కుంకీలపై మదపు టేనుగుల దాడులు తప్పవేమో
- మదపు టేనుగులను అదుపు చేసేదెన్నడో?
- శాశ్వత పరిష్కారం కావాలంటున్న రైతులు



అడవిలోంచి వచ్చే ప్రమాదకర ఒంటరి మదపుటేనుగులు

**పలమనేరు :** జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య తీరని వేదనగా మారింది. అడవిని దాటుతున్న ఏనుగులు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. ఏనుగుల దాడుల్లో రైతుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అడవిని దాటి బయటకొచ్చిన ఏనుగులు వివిధ కారణాలతో మృతి చెందుతున్నాయి. అడవిలోంచి ఏనుగులు బయటకు రాకుండా కట్టడి చేసేందుకు ఇప్పటి దాకా అటవీశాఖ చేపట్టిన సోలార్ ఫెన్సింగ్, కందకాలు ప్రయోజనం లేకుండా పోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలంలోని మొసలిమడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు చేపట్టింది. ఇటీవలే టేకుమంద ఫారెస్ట్‌లో కుంకీ ఏనుగుల ట్రయల్ రన్ చేపట్టి అది విజయవంతమైందని అధికారులు చెబుతున్నారు. కానీ మదపుటేనుగులను కట్టడి చేయడం కుంకీ ఏనుగుల నుంచి కూడా కాదనేమాట ఇటీవల జరుగుతున్న ఏనుగుల దాడులను బట్టి అర్థమవుతోంది.

కౌండిన్యలో ఒంటరిగా తిరుగుతూ మదమెక్కిన మదపుటేనుగులు తరచూ జనావాసాలపైకి వస్తున్నాయి. జనంపై తీవ్రమైన కసిని పెంచుకున్నాయి. వీటిని మళ్లించేందుకు ఎలిఫెంట్ ట్రాకర్స్ బాణాసంచా పేల్చడం, జనం కేరింతలు వీటికి మరింత ఆగ్రహాన్ని తెప్పించి జనంపై తిరగబడేలా చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు మొదలైయ్యాక మదపుటేనుగులు మరింతగా రెచ్చిపోవడం అటవీశాఖకు నిద్రపట్టడంలేదనే చెప్పాలి.

#### క్యాప్చరింగ్ చేస్తేనే...



కుంకీ ఏనుగుల ద్వారా ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కుంకీల ద్వారా క్యాప్చరింగ్ ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు దుబేరా బేస్ క్యాంపు నుంచి నాలుగు, రామకుప్పం ననియాల నుంచి రెండు మొత్తం అభిమన్యు, క్రిష్ణ, జయంత్, వినాయక, దేవా, రంజన్ అను ఆరు కుంకీ ఏనుగులున్నాయి. ఇటీవల సోమలలో రైతును ఏనుగులు చంపడంతో రైతులు రోడ్డెక్కారు. దీంతో ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అటవీశాఖ హుటాహుటిన కుంకీ ట్రయల్ రన్ చేసి ప్రజల దృష్టిని మళ్లిందనే మాట వినిపిస్తోంది. ఇలా కాకుంటే కుంకీల ద్వారా మదపు టేనుగులు అన్నింటిని క్యాప్చరింగ్ చేస్తేగాని సమస్య తీరేలా లేదు.

**కుంకీల చుట్టూ తిరుగుతున్న మదపుటేనుగులు**

కుంకీ క్యాంపు పెట్టాక ఈ ప్రాంతంలోకి మదపు టేనుగులు ఎక్కువగా రావడం స్థానిక ఫారెస్ట్ అధికారులను మరింత కలవర పెడుతోంది. తాజాగా ఓ మదపు టేనుగు కుంకీ ప్రాజెక్ట్‌లోకి ఇటీవల వచ్చి బీభత్సం సృష్టించినట్టు తెలిసింది. ఏమీ చేయలేని అక్కడి సిబ్బంది ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి మదపుటేనుగు ఎలా వచ్చిందో చూడడం తప్ప చేసేదేమీ లేకుండా పోయింది. ఆ మేరకు ఎప్పుడో అడవిలోని మదపు టేనుగులు కుంకీల భరతం పట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

**పటిష్టమైన ఫెన్సింగ్ నిర్మిస్తే**



కుంకీ ఏనుగుల ద్వారా ఏనుగుల సమస్య తీరుతుందనే మాటపై నమ్మకం పోయింది. అడవిలోని మదపు టేనుగులను అదుపు చేయడం కుంకీల నుంచి కానట్టుగానే ఉంది. ఇక్కడ ఆరు కుంకీలు, వాటి కి ఆహారం, అవసరమైన ఏర్పాట్లకు కోట్లు ఖర్చు చేసే బదులు కౌండిన్య అడవి చుట్టూ పటిష్టమైన ఇనుప ఫెన్సింగ్ కట్టింటే బాగుండేది. కుంకీల ద్వారా ఇక్కడి ఏనుగుల సమస్యను పరిష్కరించడం కుదరనట్టే.

– ఉమాపతి, రైతు సంఘం నేత, పలమనేరు

**పొలాలను బీళ్లుగా పెట్టాం**



పలమనేరులోకి ఓ ఏనుగు వచ్చిందనే జనం భయడుతున్నారు. తమ ప్రాంతంలో నిత్యం ఏనుగుల సంచారం ఉంటుంది. గత కొన్నేళ్లుగా పొలాల్లో ఏ పంటలు వేయకుండా బీడు పెట్టుకున్నాం. కుంకీ ఏనుగులతో అడవిలోని ఏనుగులను కట్టడి చేస్తామన్న మాటలు జరిగేపనికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏనుగుల సమస్యకు శాశ్వతమైన పరిష్కారాన్ని చూపాలి.

– హరిక్రిష్ణ, ఏనుగుల బాధిత రైతు, గాంధీనగర్

### గజరాజుల బీభత్సం



ఏనుగులు విరిచేసిన కొబ్బరిచెట్లు

**పులిచెర్ల (కల్లూరు) :** మండలంలోని పాతపేట, చల్లావారిపల్లె, మతుకువారిపల్లె గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు పంట పొలాలపై పడి ధ్వంసం చేశాయి. దీంతో రైతులకు భారీ నష్టం చేకూరింది. ఎన్నడూ లేని విధంగా ఆదివారం ఆయా గ్రామాల్లో ఎక్కువ మంది రైతుల పంటలు ధ్వంసం కావడంతో ఆవేదన చెందుతున్నారు. ఏనుగులు మామిడి, కొబ్బరి చెట్లను పెకిలించి వేశాయి. టమోటా పంటలను తొక్కి నాశనం చేశాయి. మామిడి తోపుల చుట్టూ ఉన్న ముళ్ల కూసాలను సైతం విరిచేశాయి. పది రోజులుగా ఆయా గ్రామాల్లోనే తిరుగుతూ రాత్రి పూట పంటలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. తిష్ట వేసిన ఏనుగులు మండలాన్ని వదిలి పోవడంలేదు. దీంతో ఎక్కువ మంది రైతులు పంటలను సాగు చేయడమే మానేశారు. ఏనుగుల బెడద నుంచి అటవీశాఖ అధికారులు పంటలను కాపాడాలని కోరుతున్నారు.

### 16 నుంచి బోయకొండలో షాపులు అద్దెకు వేలం

**చౌడేపల్లె :** బోయకొండ గంగాపురంలో దేవస్థానానికి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో గల కింది అంతస్తులోని 85 షాపింగ్ రూములను 3 ఏళ్లపాటు అద్దెకు ఇవ్వడానికి మంగళవారం నుంచి మూడు రోజుల పాటు వేలం పాటలతో పాటు సీల్డు టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కొండ కింద గల గెస్ట్‌హౌస్‌లో మూడు రోజుల పాటు వేలం పాటలు జరపనున్నామని, ఆసక్తిగల వ్యాపారులు షాపింగ్ రూములను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగిలిన వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# నేడు డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితా

- మొదట్లో ఇవ్వాల్సిన జాబితా చివర్లో...
- కూటమి ప్రభుత్వం వింత పోకడ
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

**చిత్తూరు కలెక్టరేట్ :** ఏ పోటీ పరీక్ష నిర్వహించినా ఎంపిక జాబితా మొదట్లో ప్రకటించడం ఆనవాయితీ. అయితే ఇందుకు విరుద్ధంగా కూటమి ప్రభు త్వం వింత పోకడ అమలు చేసింది. మూడు విడతల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అయిన తర్వాత చివర్లో ఎంపిక జాబితా ప్రచురిస్తోంది. ఈ మేరకు ఆదివారం మెగా డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ఈనెల 15వ తేదీన మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు.

**లోలోపలే గోల్‌మాల్ .....**

పారదర్శకంగా నిర్వహించాల్సిన డీఎస్సీ ప్రక్రియను కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించింది. పరీక్షల ఫలితాలు వెల్లడించిన తర్వాత ఎంపిక జాబితాలను రోస్టర్, మెరిట్ ప్రకారం ప్రచురించాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా విడతల ప్రకారం పలు జాబితాలను ప్రచురించి గందరగోళం సృష్టించారు. లోలోపలే తమకు అనుకూలమైన వారికి పోస్టులు ముట్ట చెప్పేందుకు కుట్రలు పన్నారని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. జిల్లా స్థాయిలో జరగాల్సిన డీఎస్సీ ఎంపిక ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం వల్ల అనేక అనుమానాలకు తావిచ్చింది.

**నేడు తుది ఎంపిక జాబితాలు విడుదల.....**

నెలల తరబడి నిర్వహించిన కసరత్తు అనంతరం ఈనెల 15న జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపిక అయిన అభ్యర్థుల తుది జాబితాను ప్రచురించనున్నారు. ఈ జాబితాలను కలెక్టర్ కార్యాలయం, డీఈవో కార్యాలయంలో నోటీసు బోర్డులో పెట్టనున్నారు. అదే విధంగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీడీఎస్సీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో తుది జాబితాను అప్‌లోడ్ చేయనున్నారు.

**డీఎస్సీ ఉమ్మడి జిల్లా సమాచారం**

| | |
|---|---|
| ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నోటిఫైడ్ పోస్టులు | 1473 |
| మొదటి విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు | 1394 |
| రెండవ విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు | 45 |
| మూడవ విడతలో పరిశీలన చేసిన సర్టిఫికెట్లు | 23 |

### కార్వేటినగరాన్ని తిరుపతిలో చేర్చాలి



సమావేశం నిర్వహించిన అఖిలపక్ష నేతలు

**కార్వేటినగరం :** తుడా పరిధిలో ఉన్న కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని అఖిలపక్ష నాయకులు ఆదివారం స్కంధ పుష్కరిణి వద్ద డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బౌగోళికంగా అత్యంత దగ్గరగా ఉండడమే కాకుండా సామాజిక, ఆర్థిక , వ్యాపార, విద్యా, ఉద్యోగ, ఆరోగ్య పరంగా ఎన్నో దశాబ్దాలుగా కార్వేటినగరం మండల ప్రజలు తిరుపతి పట్టణంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని అన్నారు. అలాంటి మండలాన్ని తిరుపతిలో విలీనం చేయాలని గతంలో బాధుడే బాధుడు కార్యక్రమానికి విచ్చేసిన నేటి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారానికి వచ్చిన వెంటనే కార్వేటినగరాన్ని తిరుపతిలో చేరుస్తానని హామీ ఇచ్చారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి 16 నెలలు గడుస్తున్నప్పటికీ ఇచ్చిన మాటను నెరవేర్చలేదన్నారు. అదే విధంగా వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేరుస్తానన్నారు. ఆ హామీలపై ప్రజా ప్రతినిధులు స్పందించి కార్వేటినగరం ప్రజల ఆశాభావాన్ని నెరవేర్చాలని అన్నారు. అనంతరం కార్వేటినగరం తిరుపతిలో విలీనం చేయడంపై పోరాటం చేయడానికి ఉపాధ్యాయ సంఘ నాయకులు, విశ్రాంతి ఉద్యోగులు, కార్యాచరణ రూపొందించారు. ఈ పోరాటానికి రాజకీయ, కుల, మతాలకు అతీతంగా కలసి రావాలని పిలుపునిచ్చారు. త్వరలో చిత్తూరు కలెక్టర్, నగరి ఆర్డీఓలకు వినతి అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, వెంకట కృష్ణయాదవ్, పలువురు అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు.

### 17 నుంచి స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

**కాణిపాకం:** జిల్లాలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 50 పీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లు, 437 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 5 సీహెచ్‌సీలు, 3 ఏరియా ఆస్పత్రుల్లో 538 క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ క్యాంపుల ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలకు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

### 17న విద్యుత్ గ్రీవెన్స్

**చిత్తూరు కార్పొరేషన్ :** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బుధవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక గాంధీ రోడ్డులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. చిత్తూరు, పూతలపట్టు , నియోజకవర్గాల వినియోగదారులు సమస్యలను రాత పూర్వకంగా తెలపాలన్నారు.



# హత్యా.. ఆత్మహత్యా?

వీళ్లెవరు?..నట్టడివిలోకి ఎలా వచ్చారు..?. ప్రధాన రహదారి నుంచి అరణ్యంలోకి ఎలా చేరుకున్నారు..? పురుషుడికి చెట్టుకు ఉరివేసుకోవాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది...? ఆ పక్కనే ఉన్న మహిళ మృతదేహం ఎవరిది..?. వారికి సమీపంలోనే రెండు మృతదేహాలను పూడ్చి పెట్టిన స్థితిలో ఉన్న గుంతలేంటి..? వీళ్లంతా ఒకే కుటుంబం వారా..?. ఎవరైనా వీళ్లను ఇక్కడకు తీసుకొచ్చి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా..?. లేక ఏదైనా కష్టమొచ్చి బలవన్మరణానికి పాల్పడ్డారా..? పాకాల మండల శివారు.. జాతీయ ప్రధాన రహదారికి మూడు కిలో మీటర్ల దూరంలోని చిట్టడవిలో బయటపడిన మృతదేహాలు ఆదివారం కలకలం రేపాయి..

- అడవి మధ్యలో నాలుగు మృతదేహాలు
- ఒకే కుటుంబంగా అనుమానం
- పురుషుడు ఉరివేసుకోగా.. పక్కనే పడి ఉన్న మహిళ మృతదేహం
- పిల్లల్ని చంపి ఆపై తల్లిదండ్రులు బలవన్మరణానికి పాల్పడ్డారా?



శవాలను పూడ్చినట్టు అనుమానిస్తున్న ప్రదేశం

**పాకాల:** ఘటనా స్థలంలో మృతదేహాలు ఉన్న గుంతలు.. వాటిపై గుర్తుగా పెట్టిన రాళ్లు.. వీళ్లు ఒకే కుటుంబమా..? అనే అనుమానం కలుగుతోంది. వీరు నట్టడివిలోకి ఎలా వచ్చారు.. ఎలా మృతిచెందారు అనేదానిపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ కుటుంబాన్ని తీసుకొచ్చి ఇక్కడ చంపి ఆత్మహత్యగా చిత్రీకరించారా.. లేక ఏదైనా కష్టమొచ్చి కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడిందో తెలియడం లేదు. పాకాల మండలంలో బయటపడిన ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసుల కథనం.. పాకాల మండల పరిధిలోని పవిత్ర హోటల్ వెనుక భాగంలో ఉన్న అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన రెండు మృతదేహాలను అటవీశాఖ సిబ్బంది గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పవిత్ర హోటల్ నుంచి సుమారు 3కిలో మీటర్ల దూరంలో ఉన్న ఘటనా స్థలానికి సీఐ సుదర్శన్‌ప్రసాద్ తన సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. అక్కడ ఒక పురుషుడి మృతదేహం చెట్టుకు వేలాడుతోంది. సమీపంలోనే మహిళ మృతదేహం కింద పడి ఉంది. అక్కడే మరో ఇద్దరిని పూడ్చి పెట్టిన ఆనవాళ్లు కనిపించాయి. ఆ గుంతలపై గుర్తుగా బండరాళ్లు పెట్టి ఉన్నారు. గుంతలను తవ్వేందుకు ఉపయోగించిన పారను చెట్ల పొదల్లో పడేసి ఉన్నారు.

**అడవి మధ్యలో ఎం జరిగింది?**

పాకాల మండలం శివారు ప్రాంతం అడవిలోని నామాల బండ సమీపం, మూలకుంట వద్ద ఇద్దరి మృతదేహాలతోపాటు చిన్న పిల్లలను గుంతలో పూడ్చి పెట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. ఘటనా స్థలంలో పిల్లల దుస్తులు కనిపించాయి.

**తమిళనాడు వాసులేనా?**

మృతదేహాల వద్ద ఓ నోకియో ఫోన్ లభించింది. అలాగే కళ్లి సెల్వన్ పేరు మీదున్న తంజావూరు క్రిస్ ఆస్పత్రి ప్రిస్కిప్షన్ లభ్యమైంది. మృతులు తమిళనాడు వాసులగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే నయం కాని జబ్బు ఏదైనా బయటపడిందా..?.. సమాజాన్ని ఎదిరించి బతకలేక.. ఆత్మహత్యకు పాల్పడ్డారా..? అనే అనుమానం కలుగుతోంది. అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యకు పాల్పడ్డారో తెలియడం లేదు. లేక ఆస్తి పంపకాల్లో తేడాలొచ్చి బంధువులెవరైనా ఇక్కడకు తీసుకొచ్చి చంపి, ఆత్మహత్యగా చిత్రీకరించారో.. పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. ఇదిలావుండగా మృతదేహాలు దొరికిన ప్రాంతం పాకాల మండల పరిధిలో లేకపోవడంతో కేసును చంద్రగిరి పోలీసులకు అప్పగించినట్టు సమాచారం.

# చోరీ చేయడం.. కాశీలో మొక్కడం

- పోలీసుల అదుపులో స్మార్ట్ దొంగ!
- ధనవంతుల ఇళ్లే టార్గెట్

**పలమనేరు :** చోరీకి నెలలపాటు లాడ్జీల్లో మకాం వేసి పక్కా స్కెచ్‌తో ఇళ్లు గుల్ల చేయడం..చోరీ విజయవంతం అయ్యాక కాశీ, ప్రయాగలో పూజలు చేసే స్మార్ట్ దొంగను పలమనేరు పోలీసులు వల పన్ని చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలుస్తోంది. వివరాలు ఇలా.. పలమనేరు పట్టణంలో కొన్నాళ్లుగా కేవలం టీడీపీ నేతల ఇళ్లను టార్గెట్ చేసి కోట్లల్లో చోరీకి పాల్పడిన స్మార్ట్ దొంగను ఎట్టకేలకు ఆదివారం స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఏపీలోని కాకినాడకు చెందిన 33 ఏళ్ల వ్యక్తి సినిమా హీరోలా ఉంటూ రాష్ట్రంలోని పలుచోట్ల లాడ్జీల్లో నెలలపాటు మకాం పెట్టి తాను రియల్ వ్యాపారినంటూ నమ్మబలుకుతాడు. ఆపై మకాం వేసిన పట్టణంలోని ధనవంతుల ఇళ్లపై రెక్కీ చేసి పక్కాగా చోరీకి స్కెచ్ వేయడం, సీసీ కెమెరాలు లేకుండా చూసుకోవడం, ఇతని స్పెషాలిటీ. పలమనేరు పట్టణంలోని రాధా బంగ్లాలో నివాసం ఉంటున్న సాకేపూరుకు చెందిన రామ్మూర్తినాయుడు ఇంటిపై నిఘా పెట్టాడు. ఆ ఇంట్లో తరచూ తల్లిదండ్రులు ఉండకుండా వారి కుమార్తె మాత్రం ఉంటోందని కనుక్కున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇటీవల ఆ ఇంటిలో ఎవరూ లేరని నిర్ధారించుకుని వెనుక వైపు నుంచి షెంటిలోకి వెళ్లి రూ. కోటి దాకా చోరీ చేసినట్టు తెలిసింది. దీనిపై సాక్షి దినపత్రికలో పలమనేరులో దొంగల హల్‌చల్ అనే శీర్షికన ఈనెల 11న కథనం వెలువడింది. దీనిపై నిఘా పెట్టిన స్థానిక డీఎస్పీ డేగల ప్రభాకర్ ఈ కేసులను ఛాలెంజ్‌గా తీసుకొని పట్టుకున్నట్లు తెలిసింది.


పలమనేరులో దొంగల హల్‌చ

పలమనేరులో దొంగలపై వచ్చిన కథనం

**బాలాజీ ఇంటిలో చోరీ కూడా ఇతడే..**

పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు ఆర్వీ బాలాజీ ఇంట్లో రూ.3 కోట్ల దాకా జరిగిన చోరీలోనూ కాకినాడ స్మార్ట్ దొంగ హస్తం ఉంటుందనేది తెలుస్తోంది. పట్టణంలోని ఆయన ఇంటి వద్ద వారంతా వారం రోజుల పాటు బయటకెళ్లడంతో అక్కడి సీసీ కెమెరాలను తీసి ఆపై ఎలాంటి ఇబ్బంది లేకుండా అక్కడ చోరీ చేసుంటారనే కోణంలో స్థానిక పోలీసులు విచారిస్తున్నట్టు తెలుస్తోంది. కాగా ఈ చోరీలు చేసే స్మార్ట్ దొంగకు కాకినాడలో కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు ఉండడం కొసమెరుపు.

# శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల :** తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో కృష్ణ తేజ అతిథిగృహం వరకు భక్తులు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 82,149 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 36,149 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.85 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది